# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-07-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **మహిళల భద్రతే ప్రభుత్వ ప్రాధాన్యతని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**
2. **ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాలను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయన్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్.**
3. **విజయవంతమైన తొలి ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగం.. శుభాకాంక్షలు తెలిపిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ.**
4. **రాష్ట్రంలోని ప్రధాన నగరాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపిన మంత్రి కందుల దుర్గేష్.**

==========================

మహిళలు స్వేచ్ఛగా జీవించే వాతావరణాన్ని కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. గుంటూరులో మహిళపై జరిగిన దాడి ఘటనపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. మహిళలను అవమానించే ఘటనలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఘటనకు సంబంధం ఉన్న పార్టీ కార్యకర్తను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు కృష్ణా జిల్లాలో పర్యటిస్తున్నారు. గుడివాడ పట్టణంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ప్రజావేదిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ...

వాయిస్...27 సెకన్లు

--------------------------

స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1' ఈరోజు నింగిలోకి వెళ్లింది. తిరుపతి జిల్లా శ్రీ హరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి మధ్యాహ్నం 12 గంటల 5 నిమిషాలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైందని

శాస్త్రవేత్తలు తెలిపారు. ఇందులోని ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. రాకెట్ ప్రయోగం విజయవంతం పట్ల 'ఇస్రో, స్కైరూట్' శాస్త్రవేత్తలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఏళ్ల తరబడి స్కైరూట్ చేసిన కృషి ఫలితమే ఈ విజయమని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్యం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 10 కోట్ల రూపాయలతో ట్రామా విభాగానికి కేంద్ర మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. మరో వంద పడకల భవనం నిర్మిస్తున్నామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలియజేస్తూ...

వాయిస్...27 సెకన్లు

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పాలనలో నెలకొల్పుతున్న సుపరిపాలనకు నిదర్శనంగా రాష్ట్రంలోని 23 గ్రామ పంచాయతీలు ప్రతిష్ఠాత్మక ఐఎస్ఒ పత్రం సాధించడం రాష్ట్రానికి గర్వకారణమని ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కల్యాణ్ ఎక్స్ లో పేర్కొన్నారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో గ్రామ పంచాయతీల్లో సిటిజన్ చార్టర్ అమలు, సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, తాగు నీటి సదుపాయాలు, క్రమం తప్పని సమీక్షలు వంటి ఉత్తమ పాలనా ప్రమాణాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఈ ఘనత సాధించిన గ్రామ పంచాయతీలను, ఇందుకు కృషి చేసిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి అభినందించారు.

---------------------------

రాష్ట్రంలో విశాఖపట్నం, అరకు లోయ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలను ప్రధాన పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఢిల్లీలో అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన "ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పర్యాటకులు ఎక్కువ రోజులు బస చేసేలా కారవాన్, అడ్వెంచర్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూనే స్థానిక సంస్కృతిని పెంపొందించడమే ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇందిర ప్రియదర్శిని కూరగాయల మార్కెట్లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. నగరంలో ఏక వినియోగ ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందన్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్.గిరిధర్ కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులతో కలిసి గ్యారేజి ఆవరణలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇక అనంతపురంలో కలెక్టర్ ఓ. ఆనంద్ ఆధ్వర్యంలో "స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర" అవగాహన ర్యాలీ నిర్వహించారు.

---------------------------

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని పెనుకొండలో ఇటీవల నిర్మాణంలో ఉన్న బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌తో కలిసి ఈరోజు పరిశీలించారు. పాఠశాల భవనానికి అవసరమైన మరమ్మతులు, పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, విద్యార్థులకు అనుకూలంగా తీర్చిదిద్దాలని మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. అనంతరం పెనుకొండలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించి ఆవరణలో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేసి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

---------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్‌లో వర్షపునీరు ఒడిసిపట్టడం “క్యాచ్ ది రైన్” అనే కార్యక్రమాన్ని చేపట్టింది. దేశవ్యాప్తంగా అనేక జిల్లాలలో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వాతావరణ మార్పుల ద్వారా పెరుగుతున్న నీటి కొరత నేపథ్యంలో నీటి భద్రత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం ప్రాముఖ్యతపై పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతం నుండి ఉత్తర లక్షద్వీప్ ప్రాంతం వరకు, ఉత్తర తమిళనాడు, దక్షిణ అంతర కర్ణాటక, ఉత్తర కేరళ మీదుగా ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్ర అధికారిణి జి. లక్ష్మి పేర్కొన్నారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాం, దక్షిణ కోస్తాల్లో ఈ రోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వెల్లడిస్తూ..

వాయిస్…27 సెకన్లు

---------------------------

తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, రాజానగరం, సీతానగరం, కోరుకొండ, గోకవరం, తదితర ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచే విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రహదారులపై వర్షపు నీరు చేరింది. ఈ వర్షాలతో వ్యవసాయానికి ఊరట లభించిందని, వరి సాగుతో పాటు ఇతర పంటలకు తగిన తేమ అందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 136వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు.

=====================